## ప్రేమ్‌నగర్‌లో రూ. 55 లక్షలతో సీసీ రోడ్డు

అంబర్‌పేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రేమ్‌నగర్‌లో రూ. 55 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గురుకుల మహిళా అభ్యర్థులు

## గురుకుల పరీక్ష ఫలితాలు ప్రకటించాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నోటిఫికేషన్ నిబంధనల ప్రకారమే గురుకుల పరీక్ష ఫలితాలు ప్రకటించాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద గురుకుల మహిళా అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. జ్యోత్స్న, దీప్తి, సుజాత, మాధురి తదితరులు మాట్లాడుతూ.. కొంత మంది పురుష అభ్యర్థులు హారిజాంటల్ విధానం అమలు చేసి ఫలితాలు ప్రకటించాలని కోర్టును ఆశ్రయించడం సరికాదన్నారు. ఈ విధానంతో మహిళా అభ్యర్థులకు నష్టం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం వర్టికల్ విధానంలోనే గురుకుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.


నిరసన దీక్షలో కూర్చొని బాధితులకు సంఘీభావం ప్రకటిస్తున్న ముఠా జైసింహ

## బాధితులకు న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే కృషి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కోల్పోయిన స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ తెలిపారు. వారం రోజుల క్రితం రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు ఇళ్లను కూల్చివేశారు. న్యాయం చేయాలని బాధితులు నిరాహారదీక్ష చేపట్టారు. మద్దతుగా ముఠా జైసింహ సోమవారం వారితోపాటు దీక్షలో కూర్చొని సంఘీభావం ప్రకటించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, జాన్, నరేశ్, జ్ఞానేశ్, ఆనంద్ పాల్గొన్నారు.

### ఇళ్లు నిర్మించాలి

కూల్చివేసిన చోటే బాధితులకు ఇళ్లు నిర్మించాలని మేయర్, మునిసిపల్ కమిషనర్‌ను డీబీఎఫ్ కోరింది. సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు పి. శంకర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు ఇళ్లు నిర్మించే వరకు తాత్కాలిక షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతి దివాకర్ తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించి రెండు, టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి ఒక ఫిర్యాదు వచ్చిందన్నారు.

## క్యారమ్ ఓపెన్ విజేత ఆదిత్య

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఎం మీడియా వర్క్స్, ప్రాణహిత ఆస్పత్రి, లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్, పెట్ ప్లానెట్, ఈటీ స్పోర్ట్స్ అండ్ సర్జికల్ సంస్థల సౌజన్యంతో క్యారమ్ ఓపెన్ టోర్నమెంట్ నాగోల్‌లో సోమవారం జరిగింది. ప్రథమ స్థానంలో ఎస్. ఆదిత్య, ద్వితీయ స్థానంలో కె. శ్రీనివాస్ నిలిచారని క్యారమ్ జాతీయ రెఫరీ ఉప్పు సుధాకర్ తెలిపారు.



క్రికెట్ కిట్‌లు అందజేస్తున్న అనిల్‌కుమార్ యాదవ్

## క్రికెట్ పోటీలు ప్రారంభం

ముషీరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లో గంటసాల క్రీడా మైదానంలో క్రికెట్ లీగ్ మ్యాచ్‌లను ప్రారంభించి క్రీడాకారులకు కిట్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులపాటు జరిగే పోటీల్లో 52 టీమ్‌లు పాల్గొంటున్నాయన్నారు. మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండో బహుమతి రూ. 50 వేలు, మూడు, నాలుగో బహుమతిగా రూ. 20 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌పీసీఎల్ కో-ఆర్డినేటర్లు సంగపాక వెంకట్, ప్రభాకర్, కాంగ్రెస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి


డీజీఎం మోహన్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీధర్‌గౌడ్ తదితరులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎంసీహెచ్ కాలనీ ఈస్ట్ పార్సిగుట్టలో నెల రోజులుగా నెలకొన్న కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం జలమండలి ముషీరాబాద్ కార్యాలయంలో డీజీఎం మోహన్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ.. 50 ఇళ్లకు కలుషిత నీరు సరఫరా అవుతోందన్నారు. పాత పైపులైన్‌ను తొలగించి కొత్తది వేయాలని కోరారు. వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ, రాములు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో సెలెక్ట్ అయిన కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫీవర్ ఆస్పత్రిలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతిరోజూ వందమంది అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. శనివారం వరకు వైద్య పరీక్షలు చేస్తారు. తూర్పు మండలం డీసీపీ సాయిశ్రీ, ఓయూ ఏసీపీ సైదయ్య నల్లకుంట సీఐ జగదీశ్వర్, ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.


అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలో దేశం దివాళా తీసిందని ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్, సీఐటీయూ సంఘాల నేతలు ఆరోపించారు. సోమవారం మార్క్స్ భవన్‌లో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో రైతాంగానికి మొండి చేయి చూపించారని ఆరోపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులు పండించిన పంటకు ఏఎస్‌పీ చెల్లిస్తామన్న హామీని బీజేపీ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు మండల వెంకన్న, ఎం.డేవిడ్‌కుమార్, నందగిరి వెంకటేశ్వర్లు, సురేందర్, ఉమర్, లాల్‌కుమార్, ఎస్.ఎల్.పద్మ, ఎం.హన్మేష్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్.ఎల్.పద్మ, ఎం.హన్మేష్ తదితరులు

## ప్రోత్సాహంతోనే ప్రతిభ వెలుగులోకి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ప్రోత్సాహం అవసరమని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. కేవీ రమణాచారి పుట్టినరోజు వేడుకలు ప్రారంభమయ్యాయి. జస్టిస్ శేషశయనారెడ్డి మాట్లాడుతూ.. రమణాచారి పుట్టినరోజు వేడుకలు పండుగలా వివిధ సంస్థలు నిర్వహిస్తున్నాయని, ఇది ఆయనకు కళాకారుల పట్ల ఉన్న ప్రేమకు కారణమన్నారు. పిల్లల్లో ఉన్న ఆసక్తిని గమనించి వారిని ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. ఎందరికో సహాయపడిన రమణాచారి పదవీ విరమణ అనంతరం కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కళాపోషకులు గుది బండి వెంకటరెడ్డి, నాట్యగురువు తులసి పాల్గొన్నారు. సభానంతరం తులసి శిష్యబృందం శాస్త్రీయనృత్యాలు చేశారు.



నాట్యగురువు తులసిని సన్మానిస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి, జనార్దనమూర్తి తదితరులు

### ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడిచేసిన నిందితులకు రిమాండ్

కవాడిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌పై దాడిచేసిన నిందితులను దోమలగూడ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ట్యాంక్‌బండ్ చిల్డ్రన్స్ పార్కు వద్ద ఆదివారం ఫారూక్‌నగర్ డిపోకు చెందిన బస్సు చాంద్రాయణగుట్ట నుంచి రాణిగంజ్ డిపోవైపు వెళ్తోంది. కండక్టర్ వి. రమేష్, డ్రైవర్ షేక్ అబ్దుల్ అమీన్‌షాపై బోయినపల్లి నివాసి ఎండీ మాజిద్, తాడ్‌బంద్ నివాసి మహ్మద్ ఖాసిం చిల్డ్రన్స్ పార్కు వద్ద బస్సు ఆగగానే అకారణంగా క్రికెట్ బ్యాట్‌తో దాడి చేశారు. కండక్టర్‌కు ఎడమచేయి విరిగింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించారు.

## రైలులో చోరీ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైలులో చోరీ జరిగింది. ఓ ప్రయాణికురాలి బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్ గంగపూరి ప్రాంతానికి చెందిన కాశీప్రసాద్ సోని కుమార్తె నకుల్ సోని (32) జైపూర్ రైలులో కాచిగూడ వస్తోంది. మార్గమధ్యంలో మందకడ్ రైల్వే స్టేషన్ సమీపంలో రూ. 40,500, గ్రాము బంగారు ఆభరణం, ఖరీదైన సెల్‌ఫోన్ ఉన్న ఆమె బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితురాలు సోమవారం రాత్రి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పెంపుడు కుక్కను ఢీకొట్టిన యువకుడిపై కేసు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని పెంపుడు కుక్కకు తీవ్రమైన గాయాలయ్యాయి. బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన రాహుల్ (28) కారులో సోమవారం బర్కత్‌పుర చౌరస్తా నుంచి కాచిగూడ వెళ్తున్నాడు. మార్గమధ్యంలో భూమన్నలేన్‌లో పెంపుడు కుక్కను ఢీకొట్టాడు. కుక్క తల, కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. కుక్క యజమానురాలు మీనాకుమారి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు రాహుల్‌పై కేసు నమోదు చేశారు.


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ విద్యార్థులు

## ఓయూలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

తార్నాక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ.. కృష్ణా జలాల్లో యాభై శాతం రాష్ట్రానికి సాధించేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థి నాయకులు మిథున్, రామకృష్ణ, నాగేందర్‌రావు, అవినాష్, శ్రీను నాయక్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### మాదిగ ఉద్యమకారులకు రెండు ఎంపీ టికెట్లు కేటాయించాలి

తార్నాక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మాదిగ ఉద్యమకారులకు రెండు ఎంపీ టికెట్‌లు కేటాయించాలని దళిత, క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీ మాదిగ ఉద్యమకారులకు వరంగల్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలను కేటాయించడంతో పాటు, ఒక రాజ్యసభ స్థానం ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకభూమిక పోషించిన మాదిగ సాహితీవేత్త అందెశ్రీ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి-లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(45) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


దీక్ష వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఓబీసీ సెంట్రల్ కమిటీ ప్రతినిధులు

### జ్యోతీరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని రేపు రిలే నిరాహారదీక్షలు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మ జ్యోతీరావు పూలే, ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం రిలే నిరాహార దీక్ష వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. ఇందిరాపార్కు వద్ద 7వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిలే నిరాహారదీక్షలు కొనసాగుతాయని తెలిపారు. సెంట్రల్ కమిటీ ప్రతినిధులు వి.చిన్నయ్య, ఎస్.రవికుమార్, మంజులతయాదవ్, అంబిక తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రికి పంపిస్తున్న లేఖను ఆవిష్కరిస్తున్న విశ్వకర్మ సంఘం నేతలు

### శాసనసభ ప్రాంగణంలో జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాస్తున్నట్లు సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు వెల్లడించారు. రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ ఎంతో కృషి చేశారన్నారు. కోశాధికారి రాగఫణి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ బ్యాంక్ లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ వై.అమృత తదితరులు

## బ్యాంకుల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం పెద్దపీట

● బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పేర్కొన్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలో డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ వై.అమృత ఎస్ బ్యాంక్ లోగోను సోమవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జన్‌ధన్ యోజన ద్వారా ఎంతోమంది పేద వారికి జీరో బ్యాంక్ అకౌంట్ తెరిపించిన ఘనత మోదీదే అని అన్నారు. ఎస్ బ్యాంకు సేవలు సామాన్యులకు అందేలా చూడాలన్నారు. బీజేపీ అంబర్‌పేట కన్వీనర్ శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. రామాలయం, బతుకమ్మకుంట ఫీడర్ల పరిధిలో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, డీడీ కాలనీ, అయ్యప్ప టెంపుల్ ఫీడర్ల పరిధలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, కృష్ణానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

## కుల గణనతో బీసీ, ఎంబీసీలకు న్యాయం

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని, దీనివల్ల బీసీ, ఎంబీసీ కులాలకు న్యాయం జరుగుతుందని జాతీయ ఎంబీసీ సంఘాల సమితి కన్వీనర్ కొండూరి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బీసీ, ఎంబీసీ కులాల చిరకాల వాంఛ కులగణనతో నెరవేరబోతుందన్నారు. దీనివల్ల విద్య, ఉద్యోగ, ఆర్థికపరమైన అంశాలలో ఎంబీసీలకు న్యాయం జరుగుతుందన్నారు.


సివరేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

## డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనుల పరిశీలన

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చప్పల్‌బజార్ నుంచి నింబోలిఅడ్డ లాల్‌బహదూర్ శాస్త్రి హైస్కూల్ వరకు నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. పనులను జలమండలి డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌యాదవ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. పైపులైన్ నిర్మాణం వల్ల చప్పల్‌బజార్, నింబోలిఅడ్డలో డ్రైనేజీ సమస్య పరిష్కారమవుతుందన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నేతలు మల్లికార్జున్, వరలక్ష్మి, బి.భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణానగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ కె. రవిచారి కోరారు. సోమవారం బస్తీలో ఆయన పర్యటించారు. స్థానికులు డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కరించాలని జలమండలి డీజీఎంను ఆయన కోరారు.


డ్రైనేజీ మ్యాన్‌హోల్ వద్ద మురుగునీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

## చర్చిల నిర్మాణానికి ప్రభుత్వం భూమి కేటాయించాలి

● తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చర్చిల నిర్మాణానికి ప్రభుత్వం భూమి కేటాయించాలని తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ సదస్సు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న బహుజన సాహితీ అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. క్రిస్టియన్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, జిల్లా కేంద్రాలలో క్రిస్టియన్ సంక్షేమ భవనం నిర్మించాలని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న క్రిస్టియన్ జేఏసీ ప్రతినిధులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, పాస్టర్లకు ప్రభుత్వం ప్రతి నెల వేతనాలు చెల్లించాలని, వారి పిల్లలకు ఉచిత విద్య అందించాలని కోరారు. క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ పోస్టులను క్రిస్టియన్ జేఏసీ నాయకులకు ఇవ్వాలని కోరారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ పాస్టర్ జిలుకర రవికుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

## వ్యాపారవేత్త బీజేపీలో చేరిక

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త సుధాకర్ గాంధే మాజీ మంత్రి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఆకట్టుకున్న శ్రీనివాస కల్యాణం హరికథా గానం

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో నల్లకుంట శంకరమఠంలో హరికథ మహోత్సవాల్లో భాగంగా సోమవారం భాగవతార్ జెల్దా విశ్వనాథ జయరాములుచే నిర్వహించిన శ్రీనివాస కల్యాణం హరికథా గానం ఆకట్టుకుంది. ముఖ్యఅతిథులుగా ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరి కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కె.రఘు, చారిత్రక నవలా చక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగవతార్ జెల్దా విశ్వనాథ జయరాములును సత్కరించారు. సుబ్బారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


జెల్దా విశ్వనాథ జయరాములును సత్కరిస్తున్న అతిథులు

## గ్రంథాలయాలు జ్ఞానసముపార్జన కేంద్రాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞానసముపార్జన కేంద్రాలని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ అన్నారు. తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు, గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుడు వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతి చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ.. తన జీవితాన్ని తెలంగాణ ప్రజల కోసం అంకితం చేసిన ఆళ్వారుస్వామి సదా చిరస్మరణీయులన్నారు. గ్రంథాలయ ఉద్యోగులు వెంకటేష్‌యాదవ్, శ్రీకాంత్, ముత్యం, వెంకటేష్‌రెడ్డి, చంద్రకళ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వట్టికోట ఆళ్వారుస్వామికి నివాళులర్పిస్తున్న లైబ్రరీ సిబ్బంది